ముంపు గ్రామాలకు నిధుల వరద

- డొంకేశ్వర్ మండలానికి రూ.1.25 కోట్లు మంజూరు
- 13 గ్రామాల్లో అభివృద్ధి పనులు


గంగాసముందర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ముంపు గ్రామాలు కలిగిన డొంకేశ్వర్ మండలానికి నిధుల వరద పారింది. అభివృద్ధి పనుల కోసం 13 గ్రామాలకు కలిపి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.1.25కోట్లు మంజూరు చేసింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్(ఎస్‌డీఎఫ్), స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్(ఎస్‌సీపీ) కింద ఈ నిధులు మంజూరయ్యాయి. ఇందులో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యత ఇవ్వగా, కొన్ని చోట్ల కమ్యూనిటీ భవనాలు, ప్రహరీలు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. డొంకేశ్వర్ కొత్త మండలంగా ఏర్పడిన తర్వాత పెద్ద ఎత్తున నిధులు రావడం ఇదే మొదటిసారి.


డొంకేశ్వర్ మండల కేంద్రం

ఎస్సీ, ఎస్టీ వాడల్లో...

మంజూరైన నిధులతో ముందుగానే గుర్తించిన ఎస్సీ, ఎస్టీ వాడల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నారు. తద్వారా ఈ ప్రాంతాల్లో కొంత అభివృద్ధి కనిపించనుంది. ఐతే, పనులన్నీ రూ.5 లక్షల లోపే ఉండడంతో నామినేషన్ పద్ధతిలో చేపట్టనున్నారు. ఇందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ముందుకు వచ్చిన గుత్తేదార్లకు జీపీ తీర్మానంతో పనులు అప్పగించనున్నారు.

గ్రామం	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)		
డొంకేశ్వర్	30	చిన్నయానం	5
దత్తాపూర్	30	జీజీ నడ్కుడ	5
అన్నారం	10	నికాల్‌పూర్	5
గంగాసముందర్	10	తొండాకూర్	5
నూత్‌పల్లి	5	మారంపల్లి	5
గాదేపల్లి	5	సిర్పూర్	5
		కోమట్‌పల్లి	5

వినయ్‌రెడ్డి కృషితోనే..



కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి కృషితోనే డొంకేశ్వర్ మండలానికి నిధులు మంజూరయ్యాయి. ముంపు గ్రామాల్లో అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ వాడలకు మంచి రోజులు వచ్చాయి. – గొడిసెరం భూమేశ్ రెడ్డి, మండల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం


వేల్పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు


ఎడపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం..

బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. పలు మండలాల్లో అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ హయాంలోనే బీసీలు, ఎస్సీ ఉపకులాలకు సముచిత స్థానం లభిస్తోందని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. – సాక్షి నెట్‌వర్క్


డొంకేశ్వర్ మండల కేంద్రంలో పూలే విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


నందిపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద..


ముప్కాల్ మండల కేంద్రంలో..


పట్టణంలో ..

వర్గీకరణ బిల్లు ఆమోదం.. ఎమ్మార్పీఎస్ సంబురాలు


ఆర్మూర్ పట్టణంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లాలో సంబురాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించి.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి టపాకులు కాల్చారు. నాయకులు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వం, కార్యకర్తల కృషి ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందని వ్యాఖ్యానించారు. – సాక్షి నెట్‌వర్క్


పోతంగల్‌లో..


రెంజల్‌లో..

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను తెలుసుకుని పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం యంచ గ్రామంలోని జిల్లా సరిహద్దు చెక్ పోస్టును తనిఖీ చేశారు.

దంత వైద్య పరీక్షలు



నందిపేట్(ఆర్మూర్): సీహెచ్ కొండూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం శీను నాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు డాక్టర్ తేజ సింగ్ దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

ఫీడర్ బ్రేకర్ ప్రారంభం



బాల్కొండ: మెండోరా మండలం సావెల్ సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టౌన్ ఫీడర్ బ్రేకర్‌ను బుధవారం ట్రాన్స్‌కో డీఈఈ రాజేశ్వర్ ప్రారంభించారు. అనంతరం వినియోగదారులతో సమావేశమై విద్యుత్ ఆదాపై వివరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1912ను వినియోగించుకోవాలన్నారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను బుధవారం ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1069.50(22 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు భయపడొద్దు



రుద్రూర్: పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సునీల్ సూచించారు. రుద్రూర్ జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో 8,9,10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, స్కేల్ లు పంపిణీ చేశారు. అనంతరం వక్తలు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రుద్రూర్ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ మోహన్, శ్యాంసుందర్ పహడే, తదితరులు పాల్గొన్నారు.

కుద్వాన్‌పూర్ పాఠశాల విద్యార్థులకు..

నందిపేట్(ఆర్మూర్): కుద్వాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని బుధవారం స్థానిక ఎస్సై చిరంజీవి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు బైండ్ల ప్రశాంత్, గుండు హరిష్, మాజీ ఉపసర్పంచు మంగ్లారపు చిరంజీవి, సుంకరి సంతోష్, జావీద్, బొమ్మ శ్రీకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఫ్యాన్ల వితరణ



మాక్లూర్: దాస్‌నగర్ వద్దగల మహాత్మ జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు బుధవారం ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాలలోని తరగతి గదులలో ఫ్యాన్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతుండటం చూసి మొత్తం 20 ఫ్యాన్లు అందజేసినట్లు జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం స్వప్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం



నందిపేట్(ఆర్మూర్): ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశ పెట్టినందుకు బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని 57 ఎస్సీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు నీరగొండ బుచ్చన్న కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సీఎంను సన్మానించారు.

‘ఉత్తమ ప్రతిభ కనబరిచే వారికి ప్రోత్సాహం’

వేల్పూర్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు పారితోషికం, పురస్కారం అందజేస్తానని వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన రిటైర్డు ఐఏఎస్ అధికారి చిరంజీవులు తెలిపారు. మోతె హైస్కూలులో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తాను కూడా ఇదే పాఠశాలలో చదివి ఐఏఎస్ అయ్యాయని గుర్తు చేశారు. స్కూళ్లలో అప్పట్లో కంటే ఇప్పుడు చాలా మెరుగైన సౌకర్యాలు, సుశిక్షితులైన టీచర్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నారన్నారు. పరీక్షల్లో ప్రథమస్థానం పొందిన వారికి రూ.15 వేలు, ద్వితీయస్థాయి పొందిన వారికి రూ.10 వేల నగదు పురస్కారం అందిస్తానని వెల్లడించారు. చిరంజీవులును పాఠశాల తరపున శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం గణేష్, ఉపాధ్యాయులు, పీడీ సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ చిరంజీవులు

ఫైలేరియా వ్యాధిపై సర్వే

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీ, కెనాల్ కట్ట ఏరియాల్లో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి 8:30 గంటల నుంచి 12:30 గంటల వరకు సర్వే చేసి మొత్తం 93 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్.. సర్వేను పర్యవేక్షించారు. ప్రజల్లో ఫైలేరియా(బోధకాలు) వ్యాధిని గుర్తించి, సమర్థవంతమైన చికిత్స అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. వైద్యాధికారి శరత్ చంద్ర, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెర్కిట్(ఆర్మూర్): ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాజ గంగారం బుధవారం తెలిపారు. ఆర్మూర్ మండలంలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 1,814 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

మాక్లూర్‌లో 645 మంది విద్యార్థులు

మాక్లూర్: మండలంలో మొత్తం 645 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాధికారి సత్యనారాయణ బుధవారం వెల్లడించారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బోధన్ పరిధిలో..

బోధన్: బోధన్ అర్బన్, రూరల్, సాలూర మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని బోధన్ ఎంఈవో నాగయ్య బుధవారం తెలిపారు. మొత్తం 2,984 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ఈ మేరకు 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.


ఆర్మూర్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాజ గంగారాం

సంక్షిప్తం

నందిపేటలో తైబజార్ వేలం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట జీపీ కార్యాలయంలో శుక్రవారం తైబజార్ వేలంతో పాటు రోజువారి సంత వేలం పాట నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. తైబజర్ వేలం పాటలో పాల్గొనదలచిన వారు. రూ. 50 వేలు, రోజువారి సంత కోసం రూ. 30 వేలు డిపాజిట్‌ను శుక్రవారం ఉదయం 10 గంటల లోపు చెల్లించవలసి ఉంటుందన్నారు.

బాల్కొండలో తైబజార్‌వేలం వాయిదా..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వార సంత, రోజు వారి సంతకు బుధవారం నిర్వహించిన తైబజార్ వేలం వాయిదా పడింది. వార సంతకు రూ.5.57 లక్షలు రావాల్సి ఉండగా రూ.3.51 లక్షలే రావడంతో వాయిదా వేశారు. అలానే రోజు వారి సంతకు ఒక్కరే డిపాజిట్ కట్టడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి ప్రకటించారు.

పడగల్‌లో ఎంపీవో తనిఖీ

వేల్పూర్: పడగల్‌లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీవో సాయిలు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వండుతున్నది లేనిది చూశారు. భోజనం వండేటప్పుడు హెచ్‌ఎంలు పరిశీలించాలని సూచించారు. ఇంటి పన్నుల వసూలును నెలాఖరులోగా పూర్తి చేయాలని జీపీ సిబ్బందికి చెప్పారు.

సర్కార్ బడిలోనే చదివించండి..

బాల్కొండ: సర్కార్ బడిలోనే చదివించండి అంటూ మెండోరా మండలం బుస్సాపూర్‌లో బుధవారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్నా విద్య గురించి ఎంఈవో శ్రీనివాస్ వివరించారు. హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలకు సక్రమంగా నీరందించాలి


పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

నందిపేట్(ఆర్మూర్): పల్లె పకృతి వనాలలో మొక్కలకు సక్రమంగా నీరందించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆంధ్రనగర్‌లో ఆయన పర్యటించి పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. గ్రామాలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజినల్ పంచాయతీ అధికారి శివకృష్ణ, ఎంపీవో లక్ష్మీప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన డ్రాయింగ్ శిక్షణ

రుద్రూర్: కోటగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. 45 రోజుల నుంచి విద్యార్థులకు డ్రాయింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఇందులో నైపుణ్యం కనబరిచిన 30 మంది విద్యార్థులకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సర్టిఫికెట్లు అందచేశారు. మండల విద్యాధికారి నాదెండ్ల శ్రీనివాస్ రావ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బి.సాయిలు, హార్టికల్చర్ టీచర్ పార్వతి, రిటైర్డ్ టీచర్ కొత్తపల్లి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరువు భత్యం వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న మల్లేశ్

బోధన్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన బీడీ కార్మికులు, సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని బీడీ కంపెనీ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. నాయకులు నాగేశ్వర్, గంగామణి, నాగమణి, యాదమ్మ, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి


స్థానికులతో మాట్లాడుతున్న రాజిరెడ్డి

రెంజల్(బోధన్): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి సూచించారు. బోర్గాంలో రూ.8 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించారు. పనులను కాలనీవాసులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కార్తీక్‌యాదవ్, గైని కిరణ్, డీలర్ సాయిలు, రవి, రాకేష్, ప్రకాష్, రాజు, నగేష్, హన్మాండ్లు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేల్పూర్: వెంకటాపూర్‌లో బుధవారం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్న దాడిలో గాయపడిన తమ్ముడి మృతి

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండలం పాత పోతంగల్ గ్రామానికి చెందిన గంధపు అజయ్ కుమార్(28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు.. పాత పోతంగల్ గ్రామానికి చెందిన శేఖర్, అజయ్ కుమార్‌లు ఇద్దరూ అన్నదమ్ములు. పనికి వెళ్లే విషయమై ఇద్దరూ ఈ నెల 17న గొడవపడ్డారు. ఆ సమయంలో ఆవేశంలో అజయ్‌ను అన్న శేఖర్ కర్రతో చితకబాదాడు. గాయాల పాలైన అజయ్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ 18న అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర మహాసభలకు తరలి రావాలి

బోధన్: తెలంగాణ రైతు సంఘం మూడో రాష్ట్ర మహాసభలు ఈ నెల 25 నుంచి 27 వరకు నిజామాబాద్ నగర శివారులోని బీఎల్ఎన్ గార్డెన్‌లో జరుగనున్నాయని సీపీఐ రాష్ట్ర ప్రతినిధి కంజర భూమయ్య తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని రైతు సంఘం మహాసభల ఆహ్వాన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సభలో చర్చిస్తామని వెల్లడించారు.


మాట్లాడుతున్న భూమయ్య

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 యుగానికి ఒక్కడు - 10.50, 7.05
ల్యాంప్ - 1.55, 1000 వాలా - 4.20
ఛావా (హిందీ) - 10.10

స్క్రీన్-2 ఛావా - 11.30, 2.50, 6.10, 9.30

స్క్రీన్-3 దిల్‌రూబా - 10.15, 1.25, 7.30, 10.40,
ఆఫీసర్ ఆన్ డ్యూటీ - 4.35

స్క్రీన్-4 కోర్ట్ - 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్			
ధరలు (కిలోకు)		డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	82,047		

– నిజామాబాద్ బిజినెస్